

ముగిసిన మొహర్రం 8లో▸
తలమడుగు మండలం రుయ్యాడి మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధి. గురువారం వేడుకలు ముగియగా అన్నదానం చేశారు. గ్రామంలోని హస్సేన్ హుస్సేన్ దేవస్థానం కిటకిటలాడింది.



అన్నాభావు సాఠేకు నివాళి
జిల్లాలో సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే వర్ధంతిని నిర్వహించారు. ఆయ న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/25.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

22న జిల్లా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 22వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. అధికారిక ప్రకటన ఇంకా రానప్పటికీ జిల్లా అధికారులకు సమాచారమందింది. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా జిల్లా కేంద్రానికి రానున్న ఆయన పట్టణంలోని రిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్ట్ ఆయకట్టు స్థిరీకరణలో భాగంగా రూ.7కోట్లతో నిర్మించిన కుడి కాలువ పైపులైన్ పనులు ప్రారంభించనున్నారు. చివరగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది.

పారదర్శకంగా చేపట్టాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్యశాఖలో బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్-3194 సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం చీఫ్ అడ్వైజర్ బాబులాల్, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు మునిగెల నర్సింగ్‌రావు తదితరులున్నారు.

మాఫీ సొమ్ము రైతులకు చేరేలా చూడాలి

కైలాస్‌నగర్: పంట రుణాల మాఫీలో భాగంగా రైతుల ఖాతాల్లో జమ చేసే డబ్బులు వారికి చేరేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 18,739 మంది రైతులకు రూ.లక్ష లోపు పంట రుణాలు మాఫీ అవుతాయని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు ప్రతీ రైతువేదికలో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర డాక్యుమెంట్లతో రెన్యూవల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో రైతులకు సంబంధించిన వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారులు అందుబాటులో ఉండి రుణమాఫీ నగదు రైతులకు చేరేలా చూడాలని ఆదేశించారు. రైతులు పంట రుణాల రెన్యూవల్‌కు బ్యాంక్ అధికారులకు సహకరించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంక్ అధికారులకు సహకారం అందించాలని, ఎలాంటి సమస్యలెదురైనా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లాలో రూ.లక్ష రుణమాఫీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గూగుల్ మీట్‌లో డీఏవో పుల్లయ్య, ఎల్డీఎం ఉత్పల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు శుక్రవారం అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు డీఈవో ప్రణీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1:3 ద్వారా అభ్యర్థులను పిలవనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు నిజధ్రువ పత్రాలతో ఉదయం 10.30 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి రావాలని తెలిపారు. పీజీసీఆర్టీ నర్సింగ్ పోస్టులు-5, సీఆర్టీ ఇంగ్లిష్-1, సీఆర్టీ ఫిజికల్ సైన్స్ పోస్టు-1 భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు రెండో విడత ప్రవేశాల కోసం ఆన్‌లైన్ గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి విడత కౌన్సెలింగ్ ఈనెల 4 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు iti. telangana. gov. in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.



సమావేశానికి వస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కౌన్సిలర్లు

నెగ్గిన అవిశ్వాసం

- మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కోల్పోయిన జహీర్ రంజానీ
- ఏకమైన బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం
- పార్టీల కౌన్సిలర్ల వెంటే స్వతంత్రులు
- తటస్థంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్
- బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణుల సంబరాలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీకి భంగపాటు తప్పలేదు. గులాబీ పార్టీ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆయనపై బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో 34మంది బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్లు ఆయనకు వ్యతిరేకంగా చేతులెత్తారు. ఫలితంగా జహీర్ రంజానీ తన వైస్ చైర్మన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. బీజేపీ కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ సమావేశానికి హాజరైనప్పటికీ సరిపడా మేజిక్ ఫిగర్ ఉండగా చేతులెత్తకుండా తటస్థంగా నిలిచారు. కాగా, వారు పెట్టిన అవి శ్వాస తీర్మానం నెగ్గడంతో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నాయి. అవిశ్వాసం వీగేందుకు కాంగ్రెస్ చివరిదాకా ప్రయత్నించి విఫలమైంది.

పకడ్బందీ పోలీసు బందోబస్తు
అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గల మూడురోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. 163 సెక్షన్ అమలు చేశారు. కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందిని గుర్తింపు కార్డులతో గుర్తించి లోనికి అనుమతించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు సాయినాథ్, సత్యనారాయణ, చంద్రశేఖర్, ఫణీందర్ నిరంతరం భద్రతను పర్యవేక్షించారు. ఎస్పీ గౌస్ ఆలం కూడా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని బందోబస్తును పర్యవేక్షించారు.

ప్రత్యేక వాహనాల్లో కౌన్సిలర్లు
ప్రిసైడింగ్ అధికారి, ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి అవిశ్వాస ప్రత్యేక సమావేశాన్ని ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. క్యాంపులకు తరలిన తొమ్మిది మంది బీజేపీ కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉదయం 10.45గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. ఐదు నిమిషాల తర్వాత మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆధ్వర్యంలో క్యాంపునకు తరలిన 23మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. సమావేశం ప్రారంభమైన వెంటనే ఆర్డీవో హాజరైన కౌన్సిలర్లను లెక్కించారు. 33 మంది అవసరం కాగా, 34 మంది కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా సమావేశానికి హాజరయ్యారు. కార్యాలయం గేటు వద్దే కౌన్సిలర్ల సంతకాలు సేకరించారు. సరిపడా కోరం ఉండటంతో అవిశ్వాస ప్రక్రియ నిర్వహించారు. అవిశ్వాసానికి అనుకూలంగా ఎంతమంది ఉన్నారని ఆర్డీవో అడగగా.. 19 మంది బీఆర్‌ఎస్, ఐదుగురు కాంగ్రెస్, ఒకరు ఎంఐఎం, తొమ్మిది మంది బీజేపీ కౌన్సిలర్లు.. మొత్తం 34 మంది చేతులెత్తారు. దీంతో వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం రిజిస్టర్‌లో వారి సంతకాలు సేకరించారు. ఈ ప్రక్రియనంతా వీడియో చిత్రీకరణ చేశారు. దీంతో జహీర్ రంజానీ తన పదవి కోల్పోవాల్సి వచ్చింది. కౌన్సిల్‌లో 49 మంది సభ్యులుండగా 15మంది గైర్హాజరయ్యారు. సమావేశం ముగిసిన వెంటనే బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు విజయ సంకేతాన్ని చూపుతూ బయటకు వచ్చారు.

గులాబీ, కాషాయ పార్టీల సంబరాలు
వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిందని తెలియగానే బీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణులు మున్సిపల్ కార్యాలయ సమీపంలోని వినాయక్‌చౌక్‌కు అధికసంఖ్యలో చేరుకున్నారు. బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బీజేపీ శ్రేణులు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తనయుడు శరత్‌ను భుజాలపై ఎత్తుకుని సంతోషం వ్యక్తంజేశారు. వారి నాయకత్వం వర్ధిల్లాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కట్టడి చేసినా వినలేదు: జోగు రామన్న
ఈ సందర్భంగా ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. గూండాయిజం, రౌడీయిజం, మితి మీరడంతో పాటు భూకబ్జాలు, గుట్కా కేసులున్న వ్యక్తిగా వైస్ చైర్మన్‌ను తాము అనేకసార్లు కట్టడి చేశామని చెప్పారు. అనేక అక్రమాలు, అవినీతి చేయవచ్చనే ఉద్దేశంతో ఆయన అధికార పార్టీలోకి వెళ్లారని ఆరోపించారు. అలాంటి వ్యక్తిని గద్దెదించి, రాక్షసపాలనను అంతమొందించాలనే ఉద్దేశంతోనే అవిశ్వాస తీర్మానం పెట్టామని తెలిపారు. పార్టీలకతీతంగా కౌన్సిలర్లు తమ సిద్ధాంతాలను పక్కనపెట్టి అతడిని పదవి నుంచి దించడం పట్టణ ప్రజలకు పండగేనని చెప్పారు. ముస్లింలకు తాము వ్యతిరేకం కాదని తెలిపారు. తదుపరి వైస్ చైర్మన్‌ను చేసే అవకాశముంటే తమ పార్టీ ముస్లిం వ్యక్తికే మద్దతునిస్తుందని స్పష్టం చేశారు. అహంకారంతో విర్రవీగితే గుణపాఠం తప్పదనేందుకు ఇదే నిదర్శనమని వివరించారు.

ఎనిమిది మంది కౌన్సిలర్లపై కాంగ్రెస్ వేటు

- వారి కుటుంబ సభ్యులపై కూడా..

మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన నేపథ్యంలో పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన ఎనిమిది మంది కాంగ్రెస్ కౌన్సిలర్లపై ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. కౌన్సిలర్లు మడావి మంగళ, బడాల సుజాత, ముగులూరి విజయ్, అంబకంటి అశోక్, రేష్మా, చదల్‌వార్ సాయిప్రణయ్, పాయక్‌రావు అంజుబాయి, ఉమ్మె సల్మాతో పాటు వారి కుటుంబ సభ్యులైన మడావి రామేశ్వర్, బడాల సృజన్‌కుమార్, రేష్మా ముబారక్, చెదల్‌వార్ శంకర్, పాయక్‌రావు ఆనంద్, పాయక్‌రావు సాహెబ్‌రావు, సయ్యద్ రషీద ఉల్ హక్, సయ్యద్ షంషు ఉల్ హక్‌ను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పట్టణాధ్యక్షుడు జీ నగేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన ఆయన తక్షణమే అమలులోకి వస్తాయని చెప్పారు.



కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో సంబరాల్లో రామన్న



బీజేపీ కౌన్సిలర్లతో వస్తున్న ఎమ్మెల్యే శంకర్

'మాఫీ' సంబురం



తాంసి: సీఎం రేవంత్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు మహేందర్

- 'వేదిక'ల్లో అన్నదాతల ఆనందం
- 18,353 మందికి మాఫీ వర్తింపు
- ఖాతాల్లో రూ.120.79కోట్లు జమ

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం మొదటి విడతలతో రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తూ గురువారం నిధులు విడుదల చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని 17 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రైతులతో మాట్లాడారు. రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ కావడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. రైతులు పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'పేరు లేకుంటే ఆందోళన వద్దు'
జిల్లాలో మొదటి విడత 18,821 మంది రైతులకు గాను 18,353 కుటుంబాలకు రుణమాఫీ జరిగింది. రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా రూ.120 కోట్ల 78లక్షల 76వేల 592 జమ చేసింది. రూ.లక్ష రుణం తీసుకున్న రైతులు తమ పేరు రుణమాఫీ జాబితాలో లేనట్లయితే వ్యవసాయ శాఖ అధికారులకు వివరాలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. బ్యాంక్ అకౌంట్, ఆధార్ జిరాక్స్ కాపీలను ఏఈవోలు, ఏవోలకు అందించాలని సూచించారు. ఏవోలు దరఖాస్తు ఫారాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయానికి పంపించాలని పేర్కొన్నారు. వీటిని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపించి నెల రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అన్నదాతల సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా నోడల్ అధికారిగా ఎస్.రమేశ్‌ను నియమించినట్లు తెలిపారు. ఏవైనా సమస్యలుంటే 7288894003 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విడతలవారీగా రుణమాఫీ నిధులు
తాంసి: రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు పంటరుణ మాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం మండలంలోని బండల్‌నాగాపూర్ రైతువేదికలో రుణమాఫీ నిధుల విడుదల సందర్భంగా రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముందుగా కలెక్టర్‌కు రైతులు స్వాగతం పలికారు. అనంతరం రైతులు, అధికారులతో కలెక్టర్ రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రుణమాఫీ డబ్బులు తీసుకునేందుకు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. రైతుల సేవింగ్ ఖాతాల్లో నగదు బదిలీ చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే ఏఈవోలు, ఏవోలకు తెలుపాలని సూచించారు. మండలంలో మత్తడివాగు ఆయకట్టు పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ట్రెయినీ కలెక్టర్ అభీగ్యాన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఏవో రవీందర్, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతుతో మాట్లాడిన సీఎం
వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి సావర్గాం గ్రామానికి చెందిన రైతు బుర్రి మహేందర్‌తో నేరుగా మాట్లాడారు. 'బాగున్నావా మహేందర్.. ఎన్ని ఎకరాల భూమి ఉంది.. రుణం ఎంత ఉంది' అని అడిగారు. రైతు బదులిస్తూ 'నాకు ఎకరన్నర భూమి ఉంది. రూ.50వేల రుణం తీసుకున్నాను.. రుణం ఏకకాలంలో మాఫీ అవడం చాలా సంతోషంగా ఉంది సార్' అని సంతోషం వ్యక్తపరిచాడు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. రైతుల కష్టాలు తెలుసుకోవడానికి మంత్రి సీతక్కకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు అప్పగించానని చెప్పారు. అందరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని, రుణమాఫీపై గ్రామస్తులందరికీ వివరించాలని సూచించారు. రుణమాఫీ కింద ఆదిలాబాద్ జిల్లాకు మొదటి విడతగా రూ.120 కోట్లు ఇస్తున్నామని చెబుతూ.. రైతులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవాకేంద్రం ఏర్పాటు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో గల జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి (సీపీవో) కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), మహాలక్ష్మి (రూ.500కే గ్యాస్ సిలిండర్) పథకాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ పథకాలు వర్తించని అర్హులువటే తప్పనిసరిగా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

త్వరలో మహిళాశక్తి క్యాంటీన్



రిమ్స్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఏర్పాట్లను దగ్గరుండి చూడాలని డీఆర్డీవో సాయన్నను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణను పరిశీలించి సీఎం బస, సమావేశం హాల్, మధ్యాహ్న భోజనం, టీటీడీసీ, ఆఫీస్ క్లబ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి సంబంధించి ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎస్వో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ శాఖలో పనిచేస్తున్న ఏడుగురు మండల పంచాయతీ అధికారులు, 160మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇదివరకు వారిచ్చిన ఆప్షన్ల ఆధారంగా ఖాళీల వివరాలు ప్రకటిస్తూ పోస్టింగ్‌లు ఖరారు చేశారు. 40 శాతం నిబంధనల మేరకు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి ఒకరు, గ్రేడ్-2లో ఇద్దరు, గ్రేడ్-3లో 29 మంది, గ్రేడ్-4లో 128మందికి కౌన్సెలింగ్ నిర్వహించి స్థానచలనం కల్పించారు. ఇందులో ఎంపీవోలు, గ్రేడ్-1,2,3 కార్యదర్శులకు మల్టీజోనల్ అధికారుల నుంచి బదిలీ ఉత్తర్వులు రానుండగా, గ్రేడ్-4 కార్యదర్శులకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 19, 20 తేదీల్లో జారీ కానున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్నాన్ మాల్వియా, పంచాయతీ అధికారి ఎస్.శ్రీలత, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానచలనం పొందిన ఎంపీవోల వివరాలు

ఎంపీవో పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఆర్.లింగయ్య	గుడిహత్నూర్	తాంసి
దిలీప్‌కుమార్	తలమడుగు	గుడిహత్నూర్
సుధీర్‌రెడ్డి	తాంసి	తలమడుగు
అతుల్‌కుమార్	సిరికొండ	భీంపూర్
వినోద్‌కుమార్	భీంపూర్	బేల
సంతోష్	ఇంద్రవెల్లి	సిరికొండ
సుమేర్ అహ్మద్‌ఖాన్	బేల	ఇంద్రవెల్లి

స్పౌజ్ దరఖాస్తుల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్జీటీ బదిలీల్లో స్పౌజ్ ఉపయోగించుకున్న టీచర్ల దరఖాస్తులను గురువారం విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. 115 మంది ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకున్నారని డీఈవో ప్రణీత తెలిపారు. బదిలీల కంటే ముందు స్పౌజ్ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆయా మండలాల ఎంఈవోల ద్వారా సర్టిఫికెట్లను పరిశీలించినట్లు వివరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీలు వేశామని, కమిటీలు పరిశీలించాక ఏవైన తప్పిదాలుంటే వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు వివరించారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం సులేమాన్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్ డీఎం కార్యాలయంలో డీఎస్-6 వాహనాలు, నియంత్రణ, డ్రైవింగ్ అంశాలపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. పెరుగుతున్న సాంకేతికతను ఆర్టీసీ అందిపుచ్చుకుంటోందని తెలిపారు. కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకువస్తోందని పేర్కొన్నారు. సురక్షితంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. డీఎం కల్పన, రాజేందర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: డీఎస్సీ పరీక్షలు గురువారం జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో 74 స్కూల్ అసిస్టెంట్, 14 భాషా పండిత పోస్టులు, 2 పీఈటీ, 209 ఎస్జీటీ, 6 స్పెషల్ స్కూల్ అసిస్టెంట్, 19 స్పెషల్ ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 324 పోస్టులు ఈ డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నాయి. జిల్లాలోని నలంద కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా ఆన్‌లైన్ పద్ధతిన ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించారు. రోజుకు ఒక విడతలో వందమంది చొప్పున పరీక్ష నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 9నుంచి 11.30 గంటల వరకు ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించగా 100 మందికి 86 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పీఈటీ పరీక్ష నిర్వహించగా, 100 మందికి గాను 86 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత పరిశీలించారు. సీఎస్‌గా కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, అబ్జర్వర్లుగా అశోక్, రాజశంకర్ వ్యవహరించి పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించారు. పోలీసులు పరీక్షాకేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు పోలీసులు, సిబ్బంది ప్లకార్డులతో స్వాగతం పలికారు.

ముగిసిన బదిలీల ప్రక్రియ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారం ముగిసింది. రెవెన్యూ ఉద్యోగుల కౌన్సెలింగ్‌ను అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో ఆమె ఛాంబర్‌లో నిర్వహించారు. 40శాతం నిబంధనల మేరకు అధికారులు, ఉద్యోగులు కలిపి 77 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి స్థానచలనం కల్పించారు. ఇందులో నాయబ్ తహసీల్దార్లు 18మంది, సీనియర్ అసిస్టెంట్లు 26మంది, జూనియర్ అసిస్టెంట్లు 15 మంది, ఆఫీస్ సబార్డినేట్‌లు 18మందికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. వీరికి ఈ నెల 19, 20 తేదీల్లో బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్ తదితరులున్నారు.

పంచాయతీరాజ్ శాఖలో..
పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్‌ను జెడ్పీ సీఈవో రత్నమాల ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జూనియర్ అసిస్టెంట్లు 16 మంది, రికార్డు అసిస్టెంట్లు ఆరుగురు, టైపిస్టులు ఐదుగురు, ఆఫీస్ సబార్డినేట్‌లు 32 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి వారు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా ఖాళీల వివరాలు తెలియజేస్తూ స్థానచలనం కల్పించారు. వీరికి ఈ నెల 19, 20 తేదీల్లో బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో కలిందిని, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సెక్షన్ అసిస్టెంట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బిర్యానీలో పురుగు.. హోటల్ సీజ్..!



హోటల్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని కమల థియేటర్ సమీపంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో ఆహారంలో పురుగు రావడంతో మున్సిపల్ అధికారులు హోటల్‌కు తాళం వేశారు. వినోద్, నరేశ్ అనే కస్టమర్లు గురువారం హోటల్‌లో భోజనం చేసేందుకు వచ్చారు. సిబ్బంది తెచ్చిన భోజనంలో పురుగు ఉన్నట్లు గుర్తించి నిర్వాహకుల దృష్టికి తెచ్చారు. ఈ దృశ్యాన్ని వీడియో తీసి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు చూపిన వీడియో ఆధారంగా హోటల్‌కు తాళం వేసినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో బాల కార్మికుల గుర్తింపు



బాలలతో అధికారులు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో వివిధ దుకాణాలలో పనిచేస్తున్న ముగ్గురు బాలకార్మికులను ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అధికారులు గుర్తించారు. వారి తల్లిదండ్రులు, దుకాణాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ్‌సింగ్ మాట్లాడుతూ పిల్లల హక్కులు కాపాడటం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు సలార్, రమేశ్, మహిళాకానిస్టేబుల్ అనుప్రియ పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో ఫేక్ లింక్‌లు

నిర్మల్‌టౌన్: రైతు రుణమాఫీ అంటూ కొందరు ఫేక్ లింకులు సెల్‌ఫోన్లకు పంపుతున్నారని, వాటిని ఓపెన్ చేయవద్దని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. మెస్సేజ్‌లో లింక్ వస్తే 1930 ఫిర్యాదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యంలో కొందరు సైబర్ నేరగాళ్లు బ్యాంకుల పేరిట వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ పంపిస్తున్నారని తెలిపారు. అది యాక్సెప్ట్ చేసి ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్తుందని పేర్కొన్నారు. ఎలాంటి లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930కి లేదా http:// www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

సరిహద్దున హైఅలర్ట్

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్
- 12 మంది మావోయిస్టులు మృతి
- సరిహద్దులో అప్రమత్తమైన ఉమ్మడి జిల్లా పోలీసులు



ఎన్‌కౌంటర్ జరిగిన వందోళి అటవీ ప్రాంతం

చింతలమానెపల్లి: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వందోళి అటవీ ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో హైఅలర్ట్ పరిస్థితి నెలకొంది. ఎన్‌కౌంటర్‌పై గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ గురువారం వివరాలు వెల్లడించారు. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో విధ్వంసక ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నట్లు ఆయన వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వారోత్సవాల నేపథ్యంలో కోర్చి- తిప్పగడ్, చత్‌గావ్- కసన్‌సూర్ ఉమ్మడి దళ సభ్యులు సుమారుగా 12 నుంచి 15 మంది గడ్చిరోలి జిల్లా వందోళి సరిహద్దులోని అటవీ ప్రాంతంలో విడిది చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. డీవైఎస్పీ విశాల్ నాగర్ గోజే నేతృత్వంలోని సీ- 60 కమాండోల బృందంలోని 7 యూనిట్లను అప్రమత్తం చేశారు. అనుమానాస్పద ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన కమాండోలు తిరిగి ఫైరింగ్ చేయగా.. మావోయిస్టుల నుంచి కాల్పులు నిలిచిపోయాయి. అనంతరం సీ- 60 కమాండో దళాల ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. వీరిలో ఏడుగురు పురుషులు కాగా.. ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. చత్‌గావ్- కస్నసూర్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం యోగేశ్ దేవ్‌సింగ్(36), కోర్చి- తిప్పగడ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం ఆత్రం విశాల్ కుల్లె అలియాస్ ఆత్రం లక్ష్మణ్(47), తిప్పగడ్ ఇన్‌చార్జి డీవీసీఎం ప్రమోద్ లాల్‌సే కచ్లామి అలియాస్ దళపత్(31), చత్‌గావ్- కస్నసూర్ డిప్యూటీ కమాండ్, ఏరియా కమిటీ సభ్యుడు మహారు ధోబి గవాడె (31), కోర్చి- తిప్పగడ్ దళం డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు అనిల్ దేవ్‌సాయ్ దర్రో అలియాస్ దేవా(28), ఏరియా కమిటీ సభ్యుడు విజ్జు చటగావ్-కస్నసూర్, చత్‌గావ్-కస్నసూర్ ఏరియా కమిటీ సభ్యురాలు సరిత జార పర్స అలియాస్ మీనా అలియాస్ రామే(37), చత్‌గావ్ -కస్నసూర్ దళం ఏరియా కమిటీ సభ్యురాలు రజ్జో మంగల్ సింగ్ గవాడె అలియాస్ సమితా సిరోంటి(35), చత్‌గావ్-కస్నసూర్ దళ సభ్యురాలు రోజా, దళ సభ్యుడు సాగర్, కోర్చి- తిప్పగడ్ దళ సభ్యురాలు చందా పాడియం, కోర్చి- తిప్పగడ్ దళ సభ్యురాలు సీతా హవ్‌కె(27) ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిపై దహనం, హత్య లాంటి అనేక నేరాలు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లండించారు. ఏడు ఆటోమేటిక్ ఆయుధాలు, 11 తుపాకులు, మూడు ఏకే 47, రెండు ఇన్సాస్, ఒకటి కార్బైన్, ఒకటి ఎస్ఎల్ఆర్, పెద్దసంఖ్యలో విప్లవ సాహిత్యం, పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, బీజీఎల్‌లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో సీ- 60 కమాండో దళానికి చెందిన శంకర్ పాటావి, వివేక్ షింగోలేకు బుల్లెట్ గాయాలు కాగా.. వీరిని హెలికాప్టర్ ద్వారా నాగ్‌పూర్‌కు చికిత్స కోసం తరలించారు. ఈ ఆపరేషన్ ఐజీ ఏఎన్‌వో సందీప్ పాటిల్, గడ్చిరోలి రేంజ్ డీఐజీ అంకిత్ గోయల్, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్, అదనపు ఎస్పీలు యతీశ్ దేశ్‌ముఖ్, కుమార్ చింతా, అహేరి అదనపు ఎస్పీ ఎం.రమేశ్, డీవైఎస్పీ విశాల్ నాగర్ గోజె ఆధ్వర్యంలో జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

సరిహద్దు మండలాల్లో నిఘా..

సరిహద్దున జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సరిహద్దు మండలాల్లో నిఘా పెంచారు. కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల్లో సరిహద్దు ప్రాంతాలైన అహేరి, ఏటపల్లి, భామ్రాగడ్‌కు చెందిన వారు ఉన్నారు. మహారాష్ట్ర వైపు కొంత ఆందోళనకర వాతావరణం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో గాయాలపాలైన, తప్పించుకున్న వారు తెలంగాణ వైపు వచ్చి ఉండవచ్చనే అనుమానాలను మహారాష్ట్ర పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పోలీసులు సైతం ఈ దిశగా నిఘా పెంచారు. దళాల ఆధ్వర్యంలో కూంబింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులకు సమాచారం అందించకుండా సరిహద్దు ప్రాంతాలకు ప్రజాప్రతినిధులు వెళ్లవద్దని పోలీసు అధికారులు హెచ్చరికలు చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, అహేరి ఎమ్మెల్యే ఆత్రం ధర్మారావు బాబాతో గురువారం సమావేశం కావాల్సి ఉండగా.. పోలీసు అధికారుల సూచనతో రద్దయింది.

అప్రమత్తంగా ఉన్నాం

జిల్లా పోలీసులు మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉన్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిఘా పెంచామని పేర్కొన్నారు. ఆయా మండలాల స్టేషన్లకు సూచనలు చేశామన్నారు. కూంబింగ్ యథావిధిగా నడుస్తోందన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

- రద్దీగా హుస్సేన్ హుస్సేన్ దేవస్థానం



పీరీలకు వేసిన రూ.500 నోట్ల మాల కొనుగోలు చేస్తున్న మహిళ



రుయ్యాడిలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామం మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిగాంచింది. వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ఇక్కడి హుస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో పీరీలను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా అధికసంఖ్యలో వచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. దీంతో భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పీరీల ఊరేగింపు నిర్వహించారు. దేవస్థానంలో తీసిన గుండంను భక్తిశ్రద్ధలతో పూడ్చారు. గుండం చుట్టూ అధికసంఖ్యలో యువకులు అస్సైదులా ఆడారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన అధ్యక్షుడు లోక భూమారెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోక గణేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, మాజీ రైతు సమన్వయకర్త జీవన్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..



రాజులగూడకు బురదరోడ్డుపై కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం నర్సాపూర్ ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది బురద రోడ్డులో రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రాజులగూడ గ్రామస్తులకు వైద్యం అందించారు. వివరాలు.. సిరిచెల్మ ఆరోగ్య ఉపకేంద్రం హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక, ఎంఎల్‌హెచ్‌వో సంగీత, ఆశ కార్యకర్తలు గంగామణి, లక్ష్మి నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని రాజులగూడలో గురువారం వైద్యశిబిరం నిర్వహించాల్సి ఉంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురదమయమైంది. అయినా సిబ్బంది ఎంతో శ్రమకోర్చి రెండు కిలోమీటర్ల కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి 12 మంది రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలకు రోగ నిరోధక టీకాలు వేశారు. మరో 95మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.


ముఖరా(కే) మాజీ సర్పంచ్‌కు కేంద్ర మంత్రి అభినందన



ట్విట్టర్‌లో మీనాక్షిని అభినందించిన మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా(కే) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షిని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌ట్విట్టర్ వేదికగా అభినందించారు. పదవీ కాలం పూర్తయినా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు ఆమె పిచికారీ చేసిన ఫొటోను ఆయన ట్వీట్ చేసి అభినందనలు తెలిపారు.

వైన్స్‌లో చోరీ



వైన్స్ షటర్ తాళం పగలగొట్టి ఉన్న దృశ్యం

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని వైన్స్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం వైన్స్ పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లిన సాయన్న షటర్ తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి వైన్స్ నిర్వాహకుడు వసంత్‌రెడ్డికి సమాచారం అందించాడు. నిర్వాహకుడు పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి పరిశీలించగా షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. షాపు లోపల సీసీ కెమెరాలు, డీవీఆర్, మానిటర్‌ను దొంగలు ధ్వంసం చేశారు. దుకాణంలోని రూ.12,00 విలువైన మద్యం, కౌంటర్‌లోని రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లారు. వైన్స్ నిర్వాహకుడు వసంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు.

కల్లు దుకాణంలో..

మండల కేంద్రంలోని కల్లు దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం కల్లు దుకాణం పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లిన పిట్ల సాయన్న దుకాణం తాళం పగలగొట్టి ఉండడం గమనించి యజమానికి సమాచారం అందించాడు. యాజమాని లక్ష్మణ్‌గౌడ్ వచ్చి పరిశీలించగా సీసీ కెమెరాలు, డీవీఆర్‌ను ధ్వంసం చేసి కౌంటర్‌లోని రూ.610 నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. లక్ష్మణ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోని ఆదిలాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంస్థతోపాటు అగ్రి ఇన్‌పుట్ స్టోర్‌లో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఈవో సుమన్ తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, డిగ్రీలో బీకాం చేసి వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పక ఉండాలన్నారు. వివరాలకు 9963104247 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అదేతీరు.. అవే తిప్పలు





ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లోగల రోడ్లపై పశువులు సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు అనేక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మూగజీవాలను రోడ్లపై వదిలేసిన పశువుల యజమానులకు గతంలో మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. ఆ పశువుల కోసం గోశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాని ఊసే లేకుండా పోయింది. దీంతో అధికసంఖ్యలో పశువులు రోడ్లపై తిరుగుతుండడంతో పలు సందర్భాల్లో చిన్నపాటి ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి. పశువులు రోడ్లపై సంచరించకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

యంత్రం సాయంతో బౌలింగ్





పోలీసుల శారీరక దృఢత్వం కోసం ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. స్పెషల్ పార్టీ సిబ్బంది శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ, రోజువారీ దినచర్యలో భాగంగా వారి కోరిక మేరకు క్రికెట్ బౌలింగ్ యంత్రం ఏర్పాటు చేశారు. దీని ద్వారా శిక్షణ ఇస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాసరలో ఎమ్మెల్సీ పూజలు



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర జ్ఞానసరస్వతి అమ్మవారిని ఉపాధ్యాయ ఎమ్మెల్యే కూర రఘోత్తంరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. తర్వాత బాసర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో రఘోత్తంరెడ్డి పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. కాంప్లెక్స్ ప్రాంగణంలో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. బాసర ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చరిత్ర పరిశోధకుడు బలగం రామ్మోహన్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సయ్య పాఠశాల తరఫున రఘోత్తంరెడ్డిని సన్మానించారు. పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు వారి సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొనగిరి రమేశ్, ఎంఈవో మైసాజీ, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదపై అప్రమత్తంగా ఉండాలి

- సీఈ శ్రీనివాస్
- కడెంలో 687 అడుగుకుల చేరిన నీటిమట్టం



ప్రాజెక్ట్ రికార్డులను పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాస్

కడెం: కడెం ప్రాజెక్టుకు వస్తున్న వరదపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టు నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ సూచించారు. నిర్మల్ జిల్లలోని కడెం ప్రాజెక్టును గురువారం సందర్శించారు. ప్రాజెక్ట్ మరమ్మతు పనులు, రికార్డులను పరిశీలించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వచ్చిన ఇన్‌ఫ్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు ఉన్నారు.

687 అడుగులకు నీటిమట్టం..

కడెం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, గురువారం 687.025(4.677 టీఎంసీ) అడుగులకు చేరినట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి 2,646 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివద్ధికి కృషి చేస్తా

- ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్



ఎంపీని సన్మానిస్తున్న అంజు కుమార్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కర్తవ్యంగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్ అన్నారు. బీజేపీ కార్యాలయానికి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఎంపీని సన్మానించారు. అనంతరం నగేష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మంచి మెజారిటీ ఇచ్చినందుకు ప్రజలకు, గెలుపునకు కృషి చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసిమ్మె రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అలివేలుమంగ, జిల్లా కార్యదర్శి కొలిపెల్లి శ్రావణ్‌రెడ్డి, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిశాల అర్జున్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అయ్యన్నగారి రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీగాదే విలాస్, నాయకులు పాల్గొన్నారు.

బదిలీ అవకాశం కల్పించండి



హైదరాబాదులో బుర్ర వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు బదిలీల షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ షెడ్యూల్‌లోనే తమకు కూడా బదిలీ అవకాశం కల్పించాలని నూతనంగా రెగ్యులరైజ్ అయిన అధ్యాపకులు కోరారు. ఈమేరకు హైదరాబాదులో విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంకు గురువాం వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా తాము కాలేజీల్లో పనిచేస్తున్నామన్నారు. రెండేళ్ల నిబంధనతో సంబంధం లేకుండా మానవతా దృక్పథంలో బదిలీకి అవకాశం ఇవ్వాలని బుర్ర వెంకటేశం కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు అధ్యాపకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిరిగా రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నరహరి, ప్రసాద్ తదితరులున్నారు.

హరిత రిసార్ట్ వద్ద ఆందోళన



అందోళన చేస్తున్న కడెం వాసులు

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్ వద్ద మండల కేంద్రానికి చెందిన పలువురు గురువారం ఆందోళన చేశారు. తాము గతంలో ఇక్కడ నివాసాలు ఏర్పర్చుకుని ఉన్నామని, ప్రాజెక్టు నుంచి వరదలు వస్తాయని తమను అధికారులు ఖాళీ చేయించారని తెలిపారు. తర్వాత రిసార్ట్ నిర్మించి, తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఆరోపించారు. తమ ఇళ్ల స్థలాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులకు కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు మద్దతు తెలిపారు.